ఇక ఇంటికే పోషకాహారం

- అంగన్‌వాడీల్లో జూలై ఒకటి నుంచి అమలు
- రెండు విడతలుగా అందించేందుకు ప్రణాళికలు

నల్లజర్ల: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను అధికమించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ పథకాల కింద పోషకాహారాన్ని పంపిణీ చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు 300 నుంచి 500 మీటర్ల దూరంలో ఉండి కేంద్రాలకు వెళ్లి పోషణ కిట్లు తీసుకునేందుకు గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు జూలై ఒకటో నుంచి ఇంటి వద్దకే కిట్లు అందజేయనున్నారు. నిర్దేశిత పరిణామంలో సరకులను ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తునర్నారు.


పోతవరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం తీసుకుంటున్న బాలింతలు, గర్భిణులు, చిన్నారులు

ఇంటికే ఇవ్వాలని..

ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని కేంద్రంలోనే తీసుకుంటారా? ఇంటికి తీసుకెళ్లేందుకు ఇష్టపడుతున్నారా? అని ఇప్పటికే లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. అధిక సంఖ్యలో ఇంటికే ఇవ్వాలని సూచించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

కేంద్రాలకు రాకపోవడంతో..

కరోనా సమయంలో రెండేళ్లపాటు టీహెచ్‌ఆర్(టేక్ హోం రేషన్)పేరుతో లబ్ధిదారులకు సరుకులు ఇళ్లకే అందించారు. కోవిడ్ తగ్గుముఖం పట్టడంతో అంగన్‌వాడీ కేంద్రాలు మళ్లీ తెరిచారు. ముఖ్యంగా బాలింతలకు, గర్భిణులకు ఇస్తున్న ఆహారం దుర్వినియోగమవుతుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం గత ఏడాది జూన్ ఒకటో నుంచి అంగన్‌వాడీ కేంద్రాలలోనే భోజనం వండి అందించాలని ఆదేశించారు. భోజనం అమలు జరుగుతున్నా పూర్తి స్థాయిలో లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో కొంత వెసులుబాటు కల్పించారు. నెలలు నిండడం, ఆరోగ్య సమస్యలు, చిన్నారుల సంరక్షణ వంటి కారణాలతో కేంద్రాలకు రాలేమని చెప్పడంతో పోషకాహారం ఇంటికి తీసుకెళ్లేందుకు అవకాశం కల్పించారు. మెజార్టీ సభ్యులు ఇంటికే సరుకులు ఇవ్వాలని సూచించడంతో నెలలో రెండు విడతలుగా అందించేందుకు చర్యలు చేపట్టారు.

గోపాలపురం ప్రాజెక్ట్ పరిధిలో బాలింతలు, గర్భిణులు

మండలం	బాలింతలు	గర్భిణులు
నల్లజర్ల	483	457
దేవరపల్లి	651	460
గోపాలపురం	480	705

గర్భిణులు, బాలింతలకు ఇచ్చే సంపూర్ణ పోషణ కిట్లు

అటుకులు	కిలో
రాగిపిండి	కిలో
జొన్నపిండి	కిలో
కందిపప్పు	కిలో
బియ్యం	3 కిలోలు
బెల్లం	250 గ్రాములు
చిక్కీలు	250 గ్రాములు
ఎండు ఖర్జూరం	250 గ్రాములు
నూనె	500 గ్రామలు
గుడ్లు	25
పాలు	5 లీటర్లు

జూలై ఒకటి నుంచి అమలు



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం జూలై ఒకటో తేదీ నుంచి సరకుల రూపంలో లబ్ధిదారుల ఇళ్లకే ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 5వ తేదీ లోగా మొదటి విడతగా బియ్యం, కందిపప్పు, నూనె, కోడిగుడ్లు, పాలు, రాగిపిండి, అటుకులు, బెల్లం, చిక్కీలు, ఎండు ఖర్జూరం అందిస్తారు. రెండో విడతగా 16, 17 తేదీల్లో కోడిగుడ్లు, పాలు అందిస్తారు.

–కె.స్వరాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సీడీపీఓ, నల్లజర్ల

హోం మంత్రికి అభినందన


కొవ్వూరులో మంత్రి తానేటి వనితను సత్కరిస్తున్న కాపు సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసిన మున్సిపల్ చైర్ పర్సన్ రత్నకుమారి, కౌన్సిలర్లు

కొవ్వూరు: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులతో పాటు ఎస్సీ కమ్యూనిటీ హాలు, కాపు కల్యాణ మండపం, మూడు అంబేడ్కర్ భవనాలకు నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితకు గురువారం నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందనలతో ముచ్చెత్తారు. జగనన్న విద్యా దీవెన కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గంలో సుమారు రూ.50 కోట్ల విలువైన ప్రతిపాదనలను మంత్రి వనిత అందజేశారు. వీటన్నింటికి సీఎం నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. దీంతో కాపు కల్యాణ మండపం నిధులు మంజూరు చేసినందుకు కాపు సంఘం నాయకులు, కాపు ప్రజాప్రతినిధులు మంత్రి వనితను ఘనంగా సత్కరించారు. పట్టణ కాపు సంఘం అధ్యక్షుడు గండ్రోతు కోదండ రామారావు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గండ్రోతు అంజనీదేవి, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పట్టణ గౌరవ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, నాయకులు తోట రామకృష్ణ, యాళ్ల నరసింహారావు, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, నామా ప్రకాశం, కౌన్సిలర్ తోట లక్ష్మి ప్రసన్న, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు సిద్ధన వాసు, రుద్రం వీరబాబు తదితరులు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పట్టణంలో ఎస్సీ కమ్యూనిటీ భవనం, మూడు మండలాల్లో మూడు అంబేడ్కర్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు ఎస్సీ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువ కప్పి మంత్రికి అభినందనలు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, కౌన్సిలర్లు వరిగేటి లలితకుమారి, చీరా అరుణ, ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగర్జున, నేతల వెంకటేష్, బొలిపో వీర్రాజు, వస్కా రమేష్ తదితరులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు గన్నమని వీర వెంకట్రాజు, ఉప్పులూరి సూరిబాబు,అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర తదితరులు మంత్రికి అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

ప్రజల అంగీకారంతోనే ఫ్యాక్టరీ నిర్మాణం


సగ్గొండ సదస్సులో మట్లాడుతున్న పోలీసులు

గోపాలపురం: గ్రామ ప్రజల అంగీకారంతోనే ఫ్యాక్టరీ నిర్మాణం చేపడతారని అందుకు కావాల్సిన అనుమతులు ప్రభుత్వం మంజూరు చేస్తుందని దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సగ్గొండ పంచాయతీ పరిధిలోని గోపవరంలో నిర్మాణం చేపట్టే ఫ్యాక్టరీ నిర్మాణంపై గురవారం గ్రామస్తుల సమక్షంలో సదస్సు నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చర్చలు జరిగాలన్నారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ యాజమాన్యం, గ్రామ సర్పంచ్‌లతో గ్రామస్తులు అడిగిన పలు ప్రశ్నలకు ఫ్యాక్టరీ యాజమాన్యం సమాధానం చెప్పారు. ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం వల్ల నిరుద్యోగులకు ఉద్యోగంతో పాటు గ్రామానికి ఆదాయం ఉంటుందని గ్రామ సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు సూచించారు. ఫ్యాక్టరీ నిర్మాణంలో ఎటువంటి అవశేషాలు లేకుండా గ్రామస్తుల ఆరోగ్యానికి భంగం వాటిల్లకుండా ఫ్యాక్టరీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని దేవరపల్లి సీఐ శ్రీనివాసరావు సూచించారు. ఈ కార్యక్రమంలో సగ్గొండ, గోపవరం గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృష్ణారావు సేవలు ఎనలేనవి

చాగల్లు: ప్రముఖ సినీ దర్శకుడు వీవీ వినాయక్ తండ్రి, చాగల్లు మాజీ సర్పంచ్ గండ్రోతు కృష్ణారావు వర్ధంతిని గురువారం చాగల్లులో ఘనంగా నిర్వహించారు. చాగల్లు ఇందిరమ్మ కాలనీలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆత్మ చైర్మన్ గండ్రోతు సురేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ మండల గౌరవ అధ్యక్షుడు జుట్టా కొండలరావు మాట్లాడుతూ కృష్ణారావు సర్పంచ్‌గా చాగల్లు గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. మాజీ ఎంపీటీసీ గండ్రోతు సూర్యనారాయణ, శ్యామ్, మంగరాజు, సర్వారాయుడు, సూరిబాబు, పుట్టయ్య పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన మహిళల వాలీబాల్ జట్టు

కొవ్వూరు: ఈ నెల 28 నుంచి జూన్ ఒకటో తేదీ వరకూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కోల్‌కత్తాలో నిర్వహించే 45వ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర స్థాయి మహిళల జట్టుకి శాప్ నుంచి అందిన క్రీడసామగ్రి కిట్లను గురువారం హోమ్ మంత్రి తానేటి వనిత అందజేవారు. పట్టణంలో క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులు మంత్రిని కలిశారు. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకూ ఈ జట్టుకి కొవ్వూరులోనే శిక్షణ అందించినట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొయ్యల ప్రసాద్ తెలిపారు. జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరిచాలని క్రీడకారులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


నల్లజర్లలో 2001-02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

నల్లజర్ల: ఇరవై మూడేళ్ల క్రితం అందరూ ఒకే దగ్గర చదువుకొని ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా గురువారం కలుసుకున్నారు. గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 2001-02 సంవత్సరంలో స్థానిక జెడ్పీ హైస్కూలులో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ ఆ పాఠశాలలోనే కలుసుకున్నారు. పూర్వ మధురస్మృతులను తలంచుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన దత్తు మేడమ్, ఐడీపీ అప్పారావు, చంద్రరావు, బేబి, తాతారావును సత్కరించారు. పాఠశాల అభివృద్ధిలో తామంతా భాగస్వాములవుతామని కొర్రపాటి వెంకట్, ప్రత్తి వినోద్, రాజేష్, పోతుల మహేష్, కె.దుర్గారావు, రామాంజనేయులు, పాము శ్రీను తదితరులు చెప్పారు.

సీఎం సభలో మాట్లాడిన విద్యార్థినికి రూ.పది వేల సాయం


దివ్యను అభినందిస్తున్న తోట రామకృష్ణ, సర్పంచ్ వెంకటరావు తదితరులు

తాళ్లపూడి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్న విద్యాదీవెన సభలో అనర్గళంగా మాట్లాడిన పెద్దేవం గ్రామానికి చెందిన తిరిగిపల్లి దివ్యను పలువురు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తోట రామకృష్ణ మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన విద్యార్థి ముఖ్యమంత్రి జగనన్న ముందు మాట్లాడిన తీరుపై ప్రశంసలు అందుకోవడం తమ గ్రామానికి గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఆమె ఉన్నత చదువుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామ సచివాలయం వద్ద రామకృష్ణతో పాటు, సర్పంచ్ తిరిగిపల్లి వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి అలేఖ్య, వార్డు సభ్యులు దివ్య, అతని తల్లిదండ్రులను అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మైలవరపు రాదాకృష్ణ, యండపల్లి పద్మావతి, పెదవేగి వీరమణి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


శ్రీదేవికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

నిడదవోలు రూరల్: తాడిమళ్లకు చెందిన న్యాయవాది కొనకళ్ల వెంకటేశ్వరరావు కాలేయానికి సంబంధించిన వ్యాధితో బాధపడుతూ మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. దీనికి స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.15 లక్షల మంజూరు చేశారు. ఆ చెక్కును వెంకటేశ్వరరావు భార్య శ్రీదేవికి ఎమ్మెల్యే జి.శ్రీనివాసునాయుడు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచ్ బయ్యే రాధా రాణి, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ రథ సారథులు వలంటీర్లు


వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసునాయుడు, నాయకులు


ద్వారకా తిరుమలలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- ఎమ్మెల్యే శ్రీనివాసునాయుడు
- వలంటీర్లకు అభినందనలు

నిడదవోలు రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ ప్రజల వద్దకు చేర్చి వలంటీర్లు సంక్షేమ రథ సారథులుగా కీర్తి పొందారని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాసునాయుడు అన్నారు. నిడదవోలు కాపు కల్యాణ మండపంలో జరిగిన వలంటీర్ల వందనం కార్యక్రమంలో భాగంగా కోరుమామిడి, తాడిమళ్ల, కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి, సూరాపురం, తిమ్మరాజుపాలెం, రావిమెట్ల, కంసాలిపాలెం, సింగవరం, తాళ్లపాలెం, శెట్టిపేట గ్రామాల్లో విశిష్ట సేవలందించిన 153 మంది వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాల ప్రదానోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించడంలో వలంటీర్ల సేవలు ఎనలేనివన్నారు. నాలుగేళ్లుగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఎమ్మెల్యే సతిమణి సుమతల, కుమారుడు వరుణ్ సాయి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సచివాలయాల మండల కన్వీనర్ వెలగన పోలయ్య, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, సర్పంచులు అంబటి గోపమ్మ, బయ్యే రాధారాణి, శ్రీనివాస్, చంద్రశేఖర్, ఎంపీడీఓ మూర్తిబాబు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది,పార్టీ నాయకులు పాల్గొన్నారు.


చిన్నాయగూడెంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ దుర్గారావు తదితరులు

చిన్నాయగూడెంలో వలంటీర్లకు వందనం

దేవరపల్లి: చిన్నాయగూడెం గ్రామ సచివాలయం వద్ద గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నాయగూడెం, యాదవోలు గ్రామాలకు చెందిన వలంటీర్లను సన్మానించి, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. గ్రామాల సర్పంచ్‌లు డేగపాటి జ్యోతిరాణి, సున్న వరప్రసాద్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు విప్పర్తి చంద్ర, తమ్మిరెడ్డి ప్రసన్న, సొసైటీ అధ్యక్షుడు గడా జగదీష్, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గంగరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు: ఎమ్మెల్యే

ద్వారకాతిరుమల: గ్రామ వలంటీర్లు సంక్షేమ వారధులని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక ఎస్ఎస్ వేదిక కల్యాణ మండపంలో గ్రామంలోని వలంటీర్లను గురువారం ఆయన సత్కరించారు.

120 హెక్టార్లలో అరటికి నష్టం

- కొవ్వూరు ఉద్యాన అధికారి శ్రీనివాస్
- పంట పరిశీలన


కాకరపర్రులో అరిటితోటను పరిశీలిస్తున్న శ్రీనివాస్

పెరవలి: మండలంలో ఈ నెల 21వ తేదీన వచ్చిన ఈదురు గాలులకు 120 హెక్టార్లలో అరటి తోటలకు నష్టం వాటిల్లిందని కొవ్వూరు ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మండలంలో కాకరపర్రు, అజ్జరం, ముక్కామల, ఖండవల్లి గ్రామాల్లో బుధవారం పర్యటించి ఆయన విరిగిపోయిన అరటి తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈదురు గాలులు 80 కిలోమీటర్ల వేగంతో రావడంలో అధిక నష్టం వాటిల్లిందన్నారు. అరటి బొందలకు గెడలు వేసినా వాటితో సహా విరిగిపోయాయని తెలిపారు. ముక్కామలలో ఒకే రైతుకి చెందిన 5 ఎకరాల అరటి తోట పూర్తిగా విరిగిపోయిందన్నారు. అక్కడ నష్టం లక్షల్లో ఉందన్నారు. విరిగిన అరటి తోటలను పరిశీలించి అంచనాలు వేశారని వీటిని పరిశీలిస్తున్నాని తెలిపారు. నష్టంపై వెంటనే ఉన్నతాధికారులకు నివేదికలు సమరిప్స్తానని రైతులకు తెలిపారు. కాకరపర్రు, ముక్కామల సర్పంచ్‌లు గుబ్బల ఆదిలక్ష్మి శ్రీనివాస్, కేతా త్రిమూర్తులు ఆయా గ్రామాల సచివాలయ వ్యవసాయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు

నల్లజర్ల: ప్రకాశరావుపాలెంలో సూపర్ స్టార్ కృష్ణ అభిమానులు ఆయన శిలా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆయన జన్మదినం ఈ నెల 31వ తేదీన ఆవిష్కరించనున్నారు. నత్తారామేశ్వరంలో దాదాపు రూ.65వేలు ఖర్చుచేసి ఈ విగ్రహం తయారు చేయించారు.

సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం

నల్లజర్ల: దూబచర్ల డైట్ సెంటర్‌లో ఇండక్షన్ ట్రైనింగ్ పొందుతున్న రెండో బ్యాచ్ అభ్యర్థులు గురువారం దూబచర్ల బస్టాండ్ వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గతంలో తమ గురించి ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని సీఎం జగన్ తమకు ఉపాధ్యాయులుగా పోస్టింగులు ఇచ్చి ఆదుకున్నారని, ఎప్పుడు రుణపడి ఉంటామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చాగల్లు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఈ తనూజ అన్నారు. గురువారం పీహెచ్‌సీలో మేరీ లైఫ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ప్లాస్టిక్ వస్తువులను వినియోగించకూడదని, కాలుష్య రహిత సమాజ కోసం అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్, జీపీ రత్నకుమారి, కె.నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన

ఉండ్రాజవరం: విద్యుత్ పొదుపు చేయడం మంటే విద్యుత్ ఉత్పత్తి చేసినట్టేనని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్ పొదుపుపై సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఏవరైనా తమ పని ప్రదేశాల నుంచి బయటకు వెళ్లే సమయంలో విద్యుత్ బల్బులు, ఫ్యానులు, స్విచ్ ఆఫ్ చేసి వెళ్లాలని, అన్ని ప్రభుత్వం కార్యాలయాలల్లో ఈ విధంగా పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామి నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్, నీరు ఆదా చేద్దాం

నల్లజర్ల: భవిష్యత్తు తరాలకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్, నీరు ఆదా చేద్దామని నల్లజర్ల సెక్షన్ ఫారెస్ట్ డీఆర్వో చల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. లైఫ్(పర్యావరణ హిత జీవనం) కార్యక్రమంలో భాగంగా గురువారం దూబచర్ల గ్రామ సచివాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులను సంరక్షించుకోవాలని, లేని పక్షంలో భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. తాగు, సాగు నీటి అవసరాలకు భూగర్భజలాలు పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడతామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యదర్శి రత్నం, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం


విద్యార్థి తనుష్కకు ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్ర బృందం

నల్లజర్ల: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అనంతపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మర్రి తనుష్క 571 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. తండ్రి శ్రీనివాసరావు పెయింటర్‌గా పనిచేసేవాడు. విద్యుత్ షాక్‌కు గురై గతంలో ఒక చేయి కోల్పోయాడు. కరోనా సమయంలో పక్షవాతం వచ్చి లేవ లేని స్థితిలో మంచంపై ఉన్నాడు. అతని పరిస్థితి చూసి శ్రీనివాసరావు స్నేహితులు తనుష్కను ఉన్నత చదువులు చదివించడానికి ముందుకు వచ్చారు. హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్న శ్రీనివాసరావు స్నేహితుడు సూర్నీడి కిరణ్ గురువారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. తన చదువుకి అండగా ఉంటామని మిత్రులు నంబూరి శ్రీనివాసరావు, అప్పల స్వామి, బైరెడ్డి శ్రీనివాసరావు, మోడేపల్లి రాము, శ్రీనివాస్ తదితరులు హామీఇచ్చారు.

ఐదుగురి అరెస్టు

చాగల్లు: బాధితుల ఫిర్యాదు మేరకు బ్రాహ్మణగూడెం గ్రామంలో చిట్టీల పేరుతో మోసం చేసిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన వల్లభనేని వెంకాయమ్మ, వారి కుటుంబ సభ్యులను కలిపి ఐదుగురిని అరెస్టు చేశామని తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్సై రమేష్ తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నల్లజర్ల: పోతవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పోతినీడుపాలెం ఫీడర్ కొత్త బ్రేకర్ పనులు జరుగుతున్న కారణంగా శుక్రవారం పోతవరం నుంచి వచ్చే అన్ని ఫీడర్లకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని తాడేపల్లిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎస్.వెంకటేశ్వరావు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోతవరం, కృష్ణాయగూడెం, కవులూరు, నబీపేట, సభద్రపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

నిడదవోలు: స్థానిక రోటరీక్లబ్ ఆడిటోరియంలో గురువారం ఉదయం 9.30 గంటలకు వలంటీర్లకు వందనం కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ కార్యాక్రమంలో పట్టణంలో 13 వార్డు సచివాలయాల పరిధిలో పని చేస్తున్న మొత్తం 212 మంది వలంటీర్లకు సత్కరిస్తారన్నారు.

వలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

ఉండ్రాజవరం: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు, ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామినాయుడు తెలిపారు. కాల్ధారీ, వేలివెన్ను, కె.సావరం, దమ్మెన్ను గ్రామాల్లో ఖాళీ అయిన ఆరు వలంటీర్లు పోస్టులకు 9 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరైయారని తెలిపారు. ఎంపికైన వారు మంగళవారం నుంచి విధులకు హాజరవుతారన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పెరవలి: ఉసులుమర్రు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దౌలూరి శ్రీనివాస్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో ఆయనను గురువారం ఎమ్మెల్యే జి.శ్రీనివాసునాయుడు పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తండ్రిలేని లోటు తీర్చలేనిదని, అయిన కుటుంబానికి అండగా ఉండాలని ఓదార్చారు. సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, మండల గృహసారథులు అధ్యక్షుడు సూర్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులానికి ఎంపికైన విద్యార్థులు

చాగల్లు: స్థానిక ఇందిరమ్మ కాలనీలో ప్రాథమిక పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీట్లు పొందినట్టు ఎంఈవో వి.ఖాదర్‌బాబు తెలిపారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోలిపో మధుశేఖర్ మాట్లాడుతూ మల్లవరపు పల్లవి, మోహన్ శ్రావ్య కొవ్వూరులో గురుకుల పాఠశాలకు, బి.దేవిశ్రీసౌమ్య రాజమండ్రిలో గురుకుల పాఠశాలకు, గంటా సౌమ్య తునిలో గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో చేరనున్నట్టు తెలిపారు.

అస్సాం రాష్ట్రానికి చెందిన వ్యక్తి మృతి

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో అస్సాం రాష్ట్రానికి చెందిన వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై సీహెచ్ వి.రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కుమార్ లంబ(47) అనే వ్యక్తి రెండు రోజులుగా బ్రాహ్మణగూడెం పరిసరాల్లో తిరుగుతున్నాడు. గురువారం సాయంత్రం వైన్ షాపు సమీపంలో మృతి చెంది ఉన్నట్టు స్థానికులు తెలియజేయడంతో మృతి దేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. వడదెబ్బతో మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు.